
Author of Highest
Number of Novels In Telugu
సూర్యదేవర
రామ్ మోహనరావు
యాత్ర - 2

# యాత్ర - 2

వీటిలో నాలుగు దీవులు అరేబియా సముద్రం వైపుగా దక్షిణం నుండి ఉత్తరానికి అర్ధచంద్రాకారంలో పేర్చినట్టుండగా అవి దక్షిణం నుండి మొదటిది పూర్వద్వార, దీన్నే బెట్ ద్వారక అంటున్నారు. ఇది ఇంగ్లీషు అక్షరం ఎల్‌షేపులో ఉంటుంది. దీనిపైన ఉన్నది సువర్ణతీర్ధ దీవి, దీనిపైన ఉన్నది ఆరంభద్వార దీవి, దానికి పైన చివరిగా ఉన్నది ఓక దీవి. మిగిలిన మూడు దీవుల్లో ధేనుకాదీవి.

పూర్వ ద్వార, సువర్ణ తీర్ధదీవులకు కాస్త ఎడంగా లోపలి కుంటుంది. దానిపైన నారాయణపురదీవి, దానిపైన ఉండేది శంకోదర దీవి. ఈ విధంగా అమరిఉన్న సప్తద్వీపమండలం ద్వారకాపురి నిర్మాణానికి ముందు కాలం నుంచి ఉన్న ప్రాంతం.

వీటిలో పూర్వద్వారదీవి ఉత్తర కొసన ద్వారకానగర నిర్మాణం జరిగుండాలి లేదా సువర్ణ తీర్ధదీవి, పూర్వ ద్వారదీవుల జలసంధి ప్రాంతంలో ఓడరేవు ఉండి ఎడం పక్కగా సముద్రమధ్య ఏర్పడిన ఎనిమిదో దీవి మీద ద్వారకానగర నిర్మాణం జరిగివుండాలి.

ఒకప్పుడు పూర్వద్వార (బెట్ ద్వారకా) దీవి దక్షిణంగా మెయిన్‌లాండ్‌తో అనుసంధానం కలిగి దీనిమీదకు భూమార్గం ఉండి ఉండాలి.

అప్పట్లో సముద్రమట్టం ఇప్పటికన్నా చాలా తక్కువ అంటారు పరిశోధకులు.

దీన్ని బలపరుస్తూ బెట్ ద్వారక సముద్రంలో మునిగిన భాగంలో అప్పట్లో శరవేగంతో రధాలు తిరిగిన బాటఛాయలు కన్పిస్తున్నాయంటారు.

కాబట్టి ద్వారక నిర్మాణం పూర్వదీవి ఉత్తర కొసకు జరిగిందా లేక, సముద్ర మధ్యంలోని మరో దీవి మీదకి జరిగిందా అనేదాన్ని నిర్ధారించడం కష్టం. కాని ఈ సప్తదీవుల ప్రాచీనతను బలపర్చే గాధ మత్స్యపురాణంలో ఉంది. ఆసక్తి కరమైన మరోగాధ కూడా ఉంది.

గార్గ్యసంహిత చెప్పే ప్రకారం - ఒకప్పుడు త్రైతేయుడనే మహాఋషి తీర్ధయాత్రలు చేస్తూ ఈ దీవి ప్రాంతానికి వచ్చాడు. ఆ దీవి ఆయనకెంతో నచ్చింది. కొంత తడవు విహరించాక- ఒక అందమైన సరస్సు కన్పిస్తే త్రైతేయముని ఆ సరస్సులో స్నానానికి వెళ్ళాడు.

ఆయన స్నానం చేసి తిరిగివచ్చే లోపల - ఆయన శిష్యుల్లో ఒకడు గురువుగారి శంఖాన్ని దొంగిలించాడు. చాలా అరుదైన దక్షిణావృత శంఖం అది.

ఈ విషయం గ్రహించిన త్రైతేయముని ఆగ్రహించి “నువ్వు శంకువుగా మారిపోదువుగాక!” అంటూ శపించాడు. తప్పు తెలుసుకున్న శిష్యుడు గురువుగారి కాళ్ళ మీదపడి క్షమాభిక్ష అర్ధించాడు. శాపాన్ని తొలగించమని వేడుకున్నాడు. కొంతసేపటికి త్రైతేయుడు శాంతించి శిష్యుడిమీద జాలిచూపాడు.

“శాపాన్ని ఉపసంహరించటం కుదరదుగాని శాపవిమోచన చెప్తాను విను. భవిష్యత్తులో శ్రీకృష్ణులవారు ఈ ప్రాంతానికి వస్తారు. వారి చేతులమీదుగా నీ శాపం తొలగిపోతుంది. అంతవరకు నీవు శంకురూపంలో కడలిలో సంచరించు” అన్నాడు.

ఆ విధంగా మహాముని త్రైతేయుడి శాపం వలన అతని శిష్యుడు ఇక్కడ శంకురూపం దాల్చాడు కాబట్టి ఈ దీవికి శంకోదర అనే పేరు వచ్చిందని గార్గ్యసంహిత చెప్తోంది. మరోగాధ ప్రకారం... శంఖాసురుడనే రాక్షసుడు బ్రహ్మ

ఆదమరచిన సమయంలో వేదాలను దొంగిలించి సముద్ర గర్భంలో దాచేశాడు. అప్పుడు బ్రహ్మ కోరినమీదట శ్రీహరి మత్స్యావతారుడై సముద్రంలో ప్రవేశించి శంఖాసురుడితో పోరాడి వధించి వేదాలను కాపాడి బ్రహ్మకు ఇవ్వటం జరిగింది.

అది కార్తీక శుక్లపక్ష పౌర్ణమినాడు జరిగింది. ఆ శంఖాసురుడి శరీరమే ఇక్కడ శంకోదర దీవిగా మారిందనేది ఆ గాధ. ఇది శ్రీహరి అవతారాల్లో తొలి అవతారమైన మత్స్యావతారగాధ.

బహుశా ఈ శంఖాసురుడి సంతతివారే మొదటి సారిగా రైవతకుడి రాజధాని కుశస్థలిమీద దాడులు చేసి రైవతకుడు బ్రహ్మలోకం నుండి తిరిగివచ్చే సరికి కుశస్థలిని నాశనం చేశారంటారు.

ఇందుకు ప్రధానకారణం శంఖాసురుడ్ని వధించింది శ్రీహరి. ఆ శ్రీహరి విసిరిన దర్భవచ్చి పడినచోటు కుశస్థలి. కాబట్టి రాక్షసులు కుశస్థలీ నగరాన్ని నేలమట్టం చేసి ప్రతీకారం తీర్చుకునుండొచ్చు.

శంకోదర దీవి కూడా శంఖాకారంలో ఉండే అతిసుందరమైన ప్రాంతం. శ్రీకృష్ణుల వారు తరచూ ఇక్కడికొచ్చి విహరించే ప్రాంతం. ఆయన అష్టభార్యల్లో ఇద్దరయిన సత్యభామాదేవి, జాంబవతిల నివాస అంతఃపురాలు ఈ దీవిమీదే ఉండేవట. శంఖాలన్నీ ఒకలా ఉండవు.

వీటిలో అరుదుగా లభించే దక్షిణావృత శంఖాలు ఉంటాయి. వీటిని తమిళంలో 'వలంపురి శంకు' అంటారు. ఇవి చాల ఖరీదైనవి కూడా. ఈ శంఖం ఇంట్లోఉంటే సకల చీడపీడలు, రోగబాధలు తొలగి ఐశ్వర్యం సిద్ధిస్తుందని ఒక నమ్మకం ఉంది.

ఆ విధంగా శంఖరూపంలో సముద్రంలో తిరుగుతున్న త్రైతేయుడి శిష్యుడికి శ్రీకృష్ణుని అనుగ్రహాన శాపం తొలగి శంఖం నుండి బయటపడి నిజరూపం పొందాడు. అతడు విడిచిన శంఖాన్నే శ్రీకృష్ణుడు తను పూరించే శంఖంగా చేసుకుని దానికి పాంచజన్య మని పేరుపెట్టారు. అది దక్షిణావృత శంఖం. పాంచజన్యం పూరిస్తే దిశలు దద్ధరిల్లి దుష్టులు, దుర్మార్గుల గుండెలు చెదిరిపోతాయి, ఆగిపోతాయి.

శ్రీకృష్ణులవారు నిర్మించుకున్న ద్వారకానగరం గల దీవి ఎక్కడ వుండేది? గల్ఫ్ ఆఫ్ కచ్ ప్రాంతంలో గోమతీనది ఏడుపాయలుగా చీలిపోగా ఏర్పడిన

ఏడుదీవుల్లో ఒక దీవి ద్వారకా లేక ఆ సమీపాన సముద్రంలో ఏర్పడిన మరో దీవి ద్వారకనా? లేక ఏడుదీవుల్లోనూ ద్వారక విస్తరించివుందా!

శ్రీకృష్ణుడుకి కొత్తగా నగరనిర్మాణం కోసం ఎటుచూసినా పన్నెండు యోజనాల దూరం విస్తీర్ణం గల దీవి గోమతీనదీ దేవత ఇచ్చింది కాదు.

ఖచ్చితంగా అది సముద్రుడు ఇచ్చిన భూభాగం. కాబట్టి మెయిన్‌లాండ్‌కి కొంత దూరంలో సముద్రంలో ఏర్పడిన దీవి. దీంతో కలుపుకుంటే ఆ ప్రాంతంలో ఎనిమిది దీవులు ఉండేవి. ద్వారక మునిగిపోయింది గాబట్టి గోమతీ నది పరీవాహక ప్రాంతంలోని ఏడు దీవుల్నే అక్కడ చూడగలం. ఈ ప్రాంతాన్ని సప్తదీపగా పిలిచేవారు. ప్రస్తుతం దీన్ని ఓకమండలంగా వ్యవహరిస్తున్నారు.

సుమారు మూడు వందల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంగల దీవి అంటే చిన్న దీవి కాదు.

అక్కడున్న ఏడు దీవులకన్నా పరిమాణంలో పెద్దది. తీరానికి ఇది సుమారు మైలుదూరంలో ఉండేది. దీవి నుండి తీరాన్ని అనుసంధానం చేస్తూ విశాలమైన రాతిబాట రహదారిగా ఉండేది. ఈ బాట వెంట యాదవుల గోవులు, మహావేగంతో పరుగెత్తే అశ్వాలు. రథాలు, ఎడ్లబండ్లు సదా ద్వారకవైపు యథేచ్ఛగా రాకపోకలు సాగించేవి.

అంతేగాని తీరం నుండి పడవలమీద ద్వారకదీవికి రాకపోకలు జరగలేదు. రుక్మిణీదేవి ప్రేమను తెలపడానికి రాయబారిగా వచ్చిన పురోహితుడుగాని, కుచేలుడు గాని శ్రీకృష్ణుని సందర్శనార్థం ద్వారక వచ్చినప్పుడు కూడా కాలినడకనే వచ్చారు. అలాగే దుర్యోధన సార్వభౌముడు, పాండవ మధ్యముడు పార్థుడు యుద్ధంలో సాయం కోరి వచ్చినప్పుడు కూడా రథాల మీదనే సరాసరి ద్వారకను చేరుకున్నారు.

ఐతే ద్వారకావాసులు విలాసవంతమైన బోట్లు, పడవలమీద సముద్రం మీద విహరిస్తుండేవారు. మత్స్యకారుల పడవలూ తిరిగేవి. అవి వేరు. కాబట్టి ద్వారకనుండి మెయిన్‌లాండ్‌ని అనుసంధానం చేసే రాతిబాట ఎక్కడ అనుసంధానమై ఉండేది అనే విషయానికి ఇదమిద్ధంగా ఆధారాలు లేవు.

అలాగే ఓడరేవు. ఇది భూమార్గానికి దగ్గరగా ఉంటుంది. దీవులమధ్య ఓడరేవు ఉంటే సరుకు రవాణా ఎగుమతి దిగుమతులకు చాలా కష్టం. ఇంతకీ యాదవులకు జరాసంధుని పీడ ఎప్పుడు విరగడైంది అనే సందేహం రావచ్చు.

రుక్మిణీదేవి అన్న రుక్మి, శిశుపాలుడు, జరాసంధుడు ముగ్గురూ మిత్రత్రయం. రుక్మి తన చెల్లి రుక్మిణిని శిశుపాలునికిచ్చి చేయాలనుకున్నాడు.

కాని రుక్మిణి శ్రీకృష్ణుని వరించటంతో రుక్మిణీ శ్రీకృష్ణుల కళ్యాణం ఆనాటి రాజకీయ పరిణామాలకి కారణమైంది. ఆ సందర్భంలో శ్రీకృష్ణుని చేతిలో ఓడిన రుక్మికి గర్వభంగమై శాంతించాడు. జరాసంధునికి యాదవులమీద కోపకారణాల్లో ఇదొకటి.

కంసుడి మరణానికే మండిపడుతున్న జరాసంధుడు ధర్మరాజు రాజసూయయాగ సందర్భంలో శిశుపాలుడి మరణంతో రెచ్చిపోతాడని శ్రీకృష్ణునికి తెలుసు. ఒకరాత్రి భీమసేనుణ్ణి వెంటబెట్టుకుని మగధ వెళ్ళాడు కృష్ణుడు.

భీముడి చేత జరాసంధుని యుద్ధానికి కవ్వింపజేశాడు. జరాసంధ, భీమసేనులకు భీకరయుద్ధం సాగింది. కాని భీమసేనుడు, జరాసంధున్ని రెండుగా చీల్చి పడేస్తున్నా అతను తిరిగి బ్రతకటంతో ఏం చేయాలో భీముడికి తోచలేదు.

అప్పుడు కృష్ణుడు ఒక గడ్డి పోచను రెండుగా చీల్చి కుడిభాగాన్ని ఎడం వైపు, ఎడమ భాగాన్ని కుడివైపునకు విసిరి కర్తవ్యాన్ని సూచించాడు.

అప్పుడు భీమసేనుడు రెట్టించిన ఉత్సాహంతో పోరాడి జరాసంధుని రెండుగా చీల్చి ఆ భాగాల్ని వ్యతిరేక దిశలో పడేశాడు. అవి తిరిగి దగ్గరయినా వ్యతిరేకంగా ఉన్నందున అతుక్కోలేదు. ఆ విధంగా జరాసంధుణ్ణి వధించడం జరిగింది. అప్పటి నుండి యాదవులు నిశ్చింతులు కాగలిగారు.

సువర్ణ ద్వీపం రుక్మిణీదేవికి అభిమాన ప్రదేశం. శ్రీకృష్ణులవారితో అచట విహరించేది. ఒకసారి తన పట్టపురాణి రుక్మిణీదేవి దాహం తీర్చటం కోసం ఈ ద్వీపం మీద బాణాన్ని ప్రయోగించి జలధార తీశాట్ట కృష్ణుడు. శ్రీకృష్ణులవారు అవతారం చాలించేనాటికి ఆయన వయసు నూటపాతిక సంవత్సరాలు.

అప్పటికి సుమారు ముప్పైసంవత్సరాల క్రితం కురుక్షేత్ర సంగ్రామం జరిగింది. కాబట్టి కురుక్షేత్ర సంగ్రామం నాటికి ఆయన వయసు తొంభై పైనే...

కురుక్షేత్ర యుద్ధానికి పదేళ్ళ ముందు కాలానికి చరక్ ద్వారకలో అడుగు పెట్టాడు. అంటే ఇప్పుడాయన వయసు ఎనభైపైనే. ఇక కురుక్షేత్ర సంగ్రామంలోని అతిరథ మహారథుల వయసు ఎంత ఉంటుందో ఊహించుకోవచ్చు.

ఆ కాలంలో మానవుల సరాసరి ఆయుః ప్రమాణం నూట ఏభై సంవత్సరాలకు తగ్గదు. అందుచేత ద్వారక విషయంలో ఖచ్చితమైన ఆధారాలుగా చెప్పబడే వాటిలో స్పష్టతలేదు.

ఆ పైన ఇతిహాసాలు గాని, చారిత్రకాంశాలు గాని, వీటి గురించిన పరిశోధనలు, వాస్తవాలు, ప్రజల నమ్మకాలు ఇంకా కాలనిర్ధారణ ఎప్పుడూ విభేదిస్తుంటాయి. పచ్చిమ సముద్రంలో ఆ కాలంలో రత్నాలు అధికంగా లభించేవి. కాబట్టి దీన్ని రత్నాకర దధి అని, రత్న గర్భదధియని వ్యవహరించేవారు. పశ్చిమ తీరంలో పూర్వం నుంచీ 'రత్నగిరి' అని రత్నపురియనీ ఇలాంటి పేర్లతో నగరాలు, గ్రామాలు ఏర్పడటానికి కారణం ఇదే.

శ్రీకృష్ణులవారు తన కోట వెనుక ప్రాకారం వద్ద కట్టించిన కాళికమ్మవారి ఆలయం లోకప్రసిద్ధమైనది. ద్వారకలోనూ, ఆ పరిసరాల్లోనూ అమ్మవార్ల ఆలయాలు అధికంగా ఉండేవి. ఓకమండల ప్రాంతంలో అతిపురాతనమైన శక్తి ఆలయాలు పధ్నాలుగు ఉండగా వీటిని గుర్తించారు.

గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో నరేంద్రమోడి ప్రత్యేక శ్రద్ధతో ఈ ఆలయాల్ని పునరుద్ధరింప జేయించటం చెప్పుకోతగ్గ విషయం.

ఉద్విగ్నభరితమై- ఉక్కిరిబిక్కిరవుతున్న మనసును అదుపుచేసుకున్నాడు చరక్. ద్వారకలో అడుగుపెట్టినప్పట్నుంచీ ఇలాంటి వరస విశేషాలకు, విచిత్రాలకు అలవాటుపడిపోయాడు.

కాని ఎంతగా మనసును అదుపుచేసుకున్నా తేరుకోలేకపోతున్నాడు. మాటలా... తమ మున్నలూరి వారి వంశమూలాలు శ్రీకృష్ణులవారి ద్వారకాపురిలో ఉన్నాయంటే నమ్మశక్యమేనా... ఆయుర్వేద వైద్యవృత్తి తమ వంశపారం పర్యంగా రావటానికి హేతువు ఏమిటో ఇప్పుడుగదా అర్ధమవుతోంది.

కాని శుశ్రుత మహర్షులవారి చిత్రపటం ఆ వరుసలో ఉండగా ఇటు తమ కుటుంబ ప్రముఖుల వరుసలోనూ అదీ ప్రధమస్థానములంకరించటంలో... ఏదైనా విశేషం ఉందా? ఇదే విషయాన్ని తండ్రి వల్లభాచార్యుని అడిగినప్పుడు-

"కుమారా... ఓడ ప్రమాదానంతరము నీకు మరపు అధికరించినటుల యున్నది. నీకు తెలియని విషయమా ఇది? త్రేతాయుగమున నాటి అవతార

పురుషుడు శ్రీరామచంద్రులవారి సహాధ్యాయి అగు ఈ శుశ్రుత మహర్షులవారే మన వంశ మూలపురుషులు నాయనా!” అన్నాడు.

ఆ మాటలు వినగానే చరక్ రోమాంచితుడయ్యాడు. ఒక్కసారిగా నరాలు తెగిపోతున్నంత ఉత్కంఠత.

మూగవాడిలా కొద్దిక్షణాలు అలాగే ఉండిపోయాడు. అసలు ఈ ద్వారకాపురిలో ప్రవేశించినప్పటి నుండి కూడా ఏదోఒక విశేషం తనను ఉక్కిరి బిక్కిరి చేస్తూనే ఉంది. ఏనాటి త్రేతాయుగం. ఏనాటి ద్వాపరయుగం... కలియుగం లోని తమ వంశమూలాలు ద్వాపరంలో ద్వారకయందు ఉన్నాయనుకున్న క్షణంలోనే ద్వాపరం కూడా కాదు తమ వంశమూలపురుషుడు త్రేతాయుగంలోని శుశ్రుతమహర్షి అని తెలిశాక చరక్ మనస్థితి స్తంభించి పోయింది.

“కుమారా... ఏమైనది? ఆరోగ్య సమస్యయా?” అంటూ కించిత్తు ఆందోళిత మనస్కుడై ప్రశ్నించాడు వల్లభాచార్యుడు.

“లేదు జనకా... తమ అనుగ్రహమున ఆరోగ్య సమస్యలేమియు లేవు. శుశ్రుతులవారు, ఆయుర్వేదమున శస్త్రచికిత్సా విధానమును పరిచయంచేసిన ఆ మహర్షులవారు మన వంశమూల పురుషులంటే నమ్మశక్యముగాకున్నది. గర్వముగానూ యున్నది.”

“కాని ఇదియే నిక్కము. శుశ్రుతులవారి వంశ పరంపర మనది. నాటి నుండి కూడా వంశానుగతంగా ఆయుర్వేదమే మన వృత్తిగా ఉన్నది.

కుటుంబంలో కొందరు వైదిక కర్మలయందు, వేదాధ్యయనము, యజ్ఞయాగాదులందు, ఆలయ అర్చకులుగను ఉన్నను ఒకరిద్దరు మాత్రం పూర్తి స్థాయి వైద్యునిగా శిక్షణపొంది ఆయుర్వేదాన్ని వంశానుగతంగా తీసుకొస్తూనే ఉన్నారు.

నా తరం వచ్చుసరికి తండ్రి, తాతల వద్ద ఆయుర్వేదం అభ్యసించిన పిమ్మట చరకమహర్షుల శిష్యుడనైతిని. అగ్నివేశుడు చరకులవద్ద నా సహాధ్యాయి.

మన వంశీకులు ఎందరో నేడు అయోధ్య అంగవంగ కళింగ మగధ హస్తిన గాంధార రాజ్యములందు ఘన వైద్యులుగా మన్ననలందుచున్నారు” అన్నాడు వల్లభాచార్యుడు. సాధువు శివయోగి తనను ఈ భాండాగారమున

దర్శించమనటంలో ఉద్దేశం చరక్‌కి ఇప్పుడు పూర్తిగా అర్ధమైంది. తన వంశమూలాలు ఏమిటో ఎక్కడికి వ్యాపించి ఉన్నాయో తెలిసింది.

"కుమారా!" అంటూ వల్లభాచార్యుల పిలుపుతో ఆలోచనలనుండి బయట పడ్డాడు చరక్.

"జనకా, ఏమి ఆనతి?" అడిగాడు.

"శ్రీకృష్ణులవారు బృందావనము నుండి ద్వారకకు వేంచేస్తున్నటుల వర్తమానమందినది. పురజనులతో పాటు బలరామప్రభువులును సోదరునికి ఘనస్వాగత సత్కారములకు ఏర్పాట్లు జేయుచున్నారు.

మేము ఒకపరి కోటకు వెడలి బలరామ ప్రభువుల దర్శనము జేసిరావలె. నీవును వచ్చిన తోడ్కొనిపోదును. ప్రభువులు నిను జూడనుత్సాహపడుచున్నారు" అన్నాడు. ఆ విధంగా వల్లభాచార్యుడు పిలవగానే కుతూహలం కొద్దీ ఆయన వెంట తనూ వెళ్ళాలనుకున్నాడు చరక్. కాని మరుక్షణమే సాధువు శివయోగి హెచ్చరిక గుర్తువచ్చి కంగారుపడ్డాడు.

తను కోట ప్రాకారందాటి లోన అడుగుపెట్టలేడు. లోనకు వెళ్ళటం జరిగిందంటే మణిభద్రయక్షుడు తనను తిరిగి కలికాలంలోకి లాక్కుపోగలడు. ఆ విషయం గుర్తురాగానే వెళ్ళాలనుకున్న ఆలోచన విరమించుకొని "క్షమించండి జనకా. నేను రానువలను గాదు. భోజనవేళకు వత్తునని మిత్రవిందకు వాగ్దానము జేసితి" అంటూ తప్పించుకున్నాడు.

"అటులనే కుమారా!" అంటూ నవ్వాడు వల్లభాచార్యుడు. "మీ ఇరువురకును త్వరలో ముహూర్తము జూచి వివాహము జరిపించవలె. లేకున్న నిను గృహవశమున జూడ గష్టమగుచున్నది" అంటూ బయటికెళ్ళి పోయాడు. మరికొంత తడవు ఆ తాళపత్ర భాండాగారమందే ఆలోచనల మధ్య గడిపాడు చరక్. పిమ్మట తనూ అశ్వంమీద మిత్రవింద కోసం శివదేవగుప్తుల వారి గృహానికి బయలుదేరాడు.

వసంతోత్సవాలకు ఇంకా నాలుగు రోజులుందనగానే ద్వారకలో పండుగకళ వచ్చేసింది. అందుకు కారణం శ్రీకృష్ణులవారు ద్వారకకు ఆగమనం చేయటం. బృందావనం నుండి బయలుదేరిన శ్రీకృష్ణులవారి రథం ద్వారకకు వస్తోందన్న వార్త తెలిసిన మరుక్షణం నుండే ద్వారకాపుర వీధుల్లో హడావుడి

మొదలైంది. మామిడాకుల తోరణాలు, పూలతోరణాలు, పుష్పగుచ్ఛాలతో రాజమార్గం వెంట ఎక్కడికక్కడ స్వాగత తోరణాలు వెలుస్తున్నాయి.

అప్పటికే మేళతాళాలు, వందిమాగధులు, గోపస్త్రీలతో కూడిన బృందం ఒకటి కోట నుండి ఎగువన నాలుగో ప్రాకార వాకిలికి చేరుకుని శ్రీకృష్ణులవారి ఆగమనం కోసం ఎదురు చూస్తున్నారు. అంతక్రితమే స్వయంగా బలరామ ప్రభువులు మంత్రులు, యాదవ ప్రముఖులు, వర్తక ప్రముఖులు అంతా శ్రీకృష్ణుల వారిని స్వాగతించడానికి నాలుగవ ప్రాకార వాకిలి దిశగా సాగిపోయారు.

* * * * *

క్రమంగా రాజమార్గం పొడవునా సౌధాల మీద మార్గం ఇరువంకలా పురజనులు తండోపతండాలుగా శ్రీకృష్ణులవారిని చూసేందుకు, ఆయనకు స్వాగతం చెప్పేందుకు వరుసగా బారులు తీరుతున్నారు.

అశ్వంమీద పోతూ ఈ హడావుడి అంతా గమనిస్తూనే ఉన్నాడు చరక్.

చతురునిగా గతస్మృతి ఏర్పడినందున గతంలో శ్రీకృష్ణ బలరామ ప్రభువులను జూచిన జ్ఞాకాలు కలుగుతున్నాయి. ఇప్పుడు తిరిగి చూడవలెనన్న కాంక్షకలుగుతోంది.

శివదేవగుప్తుల గృహాన్ని చేరగానే అశ్వాన్ని అశ్వశాలలో వదిలి మేడమీదకు వెళ్ళాడు.

వల్లభాచార్యులవారి గృహము రాచవీధికి కాస్త లోపలి పక్కవీధిలో ఉండగా శివదేవగుప్తులవారి గృహము మాత్రము రాజవీధి నానుకోనే ఉంది. రెండో అంతస్థులో మిత్రవింద శయనమందిరం కూడా అటే ఉంది. చరక్ వెళ్ళేసరికి గవాక్షం చెంత నిలబడి వీధిలో హడావుడి చూస్తోంది మిత్రవింద.

ఈ రోజు మరింత సొగసుతో – మెరిసిపోతోంది.

ఆరడుగుల పాలరాతి శిల్పంలా ఉంది. సృష్టికర్త ఆమె సౌందర్యాన్ని జాగ్రత్తగా పాలమీగడతో మలిచాడా అన్పిస్తోంది. ముఖపద్మం ఎంత చూసినా తనివి తీరదు. అసలీమె కట్టుబొట్టు వేషధారణ, రూపలావణ్యం అంతా కలికాలం స్త్రీలనుంచి పూర్తిగా విభేదిస్తున్నాయి.

ఒంటిమీద ఎన్ని బంగారు ఆభరణాలు... చిత్ర విచిత్రమైన మణిమయ నగిషీలతో కూడిన ఆభూషణాలు, వాటిచేత చాలా కష్టం. వాటిని తయారు

చేయాలంటే కలికాలం అదీ ఆధునికకాలపు స్వర్ణకారులకు తాతలు దిగిరావాలి. అంతటి పనితనం ఆ ఆభరణాల్లో కన్పిస్తుంది. ఇక్కడ అవివాహితలగు కన్యలు శంఖాల గాజులనే ధరించటం వారి ఆచారం.

ఇప్పుడు మిత్రవింద చేతులక్కూడా శంఖపుగాజులే ఉన్నాయి. వయసు పెరిగిన స్త్రీలలో కూడా చీర కట్టడమనేది ఎక్కడోగాని కన్పించదు.

స్త్రీలు లంగా జాకెట్‌లు, చున్నీవంటి వస్త్రభాగాన్నే ధరిస్తారు. బయటకు వెళ్ళాల్సివస్తే ముఖం తెలీకుండా చున్నీనే ముసుగులా ధరిస్తారు.

"ప్రియుడా... ఇదియేమి కొత్తగా వీక్షించుచుంటివి?" అతడ్ని గమనించి వికసిత ముఖారవిందంతో సమీపించి అడిగింది మిత్రవింద.

"నీ సొగసును జూస్తుంటిని ప్రియా... ఇంతటి అందము కొరకు ఎన్ని జన్మలయినను ఎత్తవచ్చునని తోచుచున్నది" అంటూ ప్రేమగా ఆమెను బాహువు లలో బంధించాడు చరక్.

మిత్రవింద గోముగా చరక్‌ను ముద్దాడింది. "ఎన్ని జన్మలయినను విడిపోక మనం ఇటులనే కలసియుండవలె" అంది.

"ఇక మనకు ఎడబాటులేదులే" అన్నాడు.

తీరా అనిన తర్వాతగాని తోచలేదు. మిత్రవిందకు ఏ భరోసాతో ఇలా హామీ ఇస్తున్నాడు? ఈమెకోసం తను ఇక్కడే ఉండిపోలేదు గదా. ఉండి శుశ్రుతకు అన్యాయం చేయలేదు. జేజితాత అగ్నివేశాచార్యులకిచ్చిన మాట తప్పలేదు.

తను కలికాలంలోకి వెళ్ళిపోతే ఈ ప్రేమమయి మిత్రవిందకు మరోసారి తను తీరని ద్రోహం చేసినట్టే గదా... ఈమె గతి ఏమిటి?

మనసు వేదనతో మూలుగుతుండగా ఆ వేణుమాధవునే తలచుకొంటూ "ఏమిటి స్వామీ నాకీ అగ్నిపరీక్ష. నాకో దారి చూపించలేవా?" అని వేడుకున్నాడు.

ఆ పూట మిత్రవిందతోపాటు – శివదేవగుప్తుని గృహమునందే భోజనం చేశాడు చరక్.

"శ్రీ కృష్ణ ప్రభువులవారు స్వాగత సత్కారాలందుకొని ద్వారకానగర ప్రవేశం చేస్తున్నా రహో!" ఒక వైతాళికుడు అశ్వారూఢుడై పురజనులను అప్రమత్తం చేస్తూ రాజమార్గం వెంట దూసుకెళ్తున్నాడు. ఎగువనుంచి నగారాకొమ్ముబూరలు, మేళతాళాల శబ్దాలు వినవస్తున్నాయి.

జయఘోష సముద్రఘోషలా విన్పిస్తోంది. రాజమార్గం ఇరువంకలా బారులు తీరిన పురజనులు అప్రమత్తులై మాధవుని రాక కోసం ఎదురు చూడసాగారు. శ్రీకృష్ణ ప్రభువు ప్రయాణిస్తున్న రథం పురప్రవేశం జేసేసరికే సాయంత్రం మూడుగంటలు దాటిపోయింది సమయం. దారిపొడవునా యాదవరాజ్య ప్రజలు నీరాజనాలు పడుతుంటే వారి అభిమానాన్ని వారింపలేక రథాన్ని మందగమనంతో నడుపవలసొచ్చింది.

నాలుగో ప్రాకారం వాకిలివద్ద వేచివున్న బలరామ ప్రభువులు సోదరుని కౌగిలించుకొని కుశలములడిగి ఆహ్వానించారు. పెద్ద ఎత్తున చేరిన పుర ప్రముఖులు, మంత్రులు అంతా జయజయ ధ్వానాలు చేశారు. హర్షాతిరేకంతో ఫెళ్ళున వాద్యఘోష ఆరంభమైంది. అక్కడి నుండి ఊరేగింపుగా నగరంలోకి బయలుదేరాడు రుక్మిణీవల్లభుడు. స్వాగత సత్కారాలు ఘనంగా జరిగాయి.

శ్రీకృష్ణులవారి రథానికి నాలుగు పవనాశ్వాలు పూన్చబడి ఉన్నాయి. సాత్యకి రథచోదకునిగా ఉన్నాడు. ఆ దివ్యరథం మణిమయ స్వర్ణకాంతులతో మెరిసిపోతోంది. ఇద్దరు ఆసీనులు గావటానికి వీలుగా మెత్తని ఆసనముండగా వెనక తట్టునుండి పాము పడగవలె వంపుతిరిగి ఎత్తుగా ముందుకు వాలిన భాగంలో నీడ కొరకు పెద్ద గొడుగులాంటి భాగం అమర్చబడి ఉంది.

ముత్యాలసరాలు, బంగారు జలతారులు, పగడాల తోరణాలతో అతిసుందరంగా అద్భుతంగా అది అలంకరింపబడివుంది. ఆ గొడుగు కింద నిలబడిన గోపదేవుడు ఎడమ చేత మురళి ఉండగా కుడిచేతిని లేపి అభయ ముద్రలో చిరునవ్వులతో ప్రజలను వీక్షిస్తూ ఆశీర్వదిస్తున్నాడు.

నుదుట కస్తూరి తిలకం, వక్షస్థలంలో కౌస్తుభం, గళసీమలో సుగంధములు వీచు పుష్పమాలిక, శిరస్సున శిఖిపింఛముతో మణిమయ కాంతులతో మెరయు కిరీటము... ఆ ఆజానుబాహుని దివ్యసుందర రూపం వర్ణింపనలవి కానిది.

ఆ నీలమేఘశ్యాముని తన్మయులై వీక్షిస్తూ పురజనులు పుష్పవర్షం కురిపిస్తున్నారు.

ఆ దివ్యమంగళ స్వరూపుని పక్కనే నిలబడున్నాడు ఆయన ఆంత రంగిక చెలికాడును, ఆస్థాన విదూషకుడును అగు వసంతయ్య పంచె అంగీ ధరించాడు. మెడలో వెండి కంటె, రెండు చేతులకూ బంగారు మురుగులు, కుడికాలికి

వెండి తోడయం ఉంది. చెవులకు కుండలాలు, ముక్కున నత్తు, తలమీద కురచజుత్తు ఉండి వెనక పొడవాటి పిలక ఉంది. కోటదిశగా శ్రీకృష్ణుల వారి ఊరేగింపు సాగుతోంది. వందిమాగధులు, మేళతాళాలు ముందు పోతూండగా వారి ననుసరించి కోలాట బృందాలు, భజనబృందాలు సాగుతున్నాయి.

శ్రీకృష్ణులవారి రధాన్ని అనుసరించి బలరామ ప్రభువులు తొమ్మిదిమంది అశ్వారూఢులై అనుసరిస్తున్నారు. వారివెనుక పురప్రముఖుల అశ్వాలు, రధాలు సాగుతున్నాయి. ఇవిగాక నగర రక్షక విభాగానికి చెందిన అశ్వికదళం రక్షణగా రాచబాటకు ఇరువంకలా వస్తున్నాయి.

దారిపొడవునా భవంతులపై నుండి పడతులు పుష్పవర్షం కురిపిస్తున్నారు. బాటకిరువంకలా ద్వారకాపురి వాసులు హర్షాతిరేకంతో జయఘోషచేస్తున్నారు. క్రమంగా ఆ ఊరేగింపు కోటను సమీపిస్తోంది. అప్పటికి సూర్యుడస్తమించే వేళయింది.

అదేవీధిలో శివదేవగుప్తుని భవంతి రెండో అంతస్తులో మిత్రవిందతో కలసి నిలబడి 'న భూతో న భవిష్యతి' అన్నట్టుగా రంగరంగ వైభవంగా సాగుతున్న శ్రీకృష్ణ ప్రభువుల ఊరేగింపును వీక్షిస్తున్నాడు చరక్.

తన్మయంతో ఒడలు మరచి పులకించి చూస్తున్నాడు. రధంలో శ్రీకృష్ణుని దివ్యమంగళ స్వరూపాన్ని గాంచి "హే కృష్ణా! ముకుందా... మురారీ... మాధవా" అంటూ మనసులోనే శ్రీకృష్ణుని కీర్తిస్తున్నాడు.

అంతలో – సరిగ్గా శివదేవగుప్తుని గృహసమీపాన – ఊరేగింపు నిలిచి పోయింది. ఏం జరిగిందో అర్ధంకాగ ప్రజలు, ముఖముఖాలు చూసుకోసాగారు. చరక్, మిత్రవిందలూ అటే చూడసాగారు.

"కృష్ణా!... కన్నయ్యా... గోపాలా... ఎక్కడున్నావు తండ్రీ... ఒక్కసారి నా కోసం ఆగలేవా? గోవిందా" ఒక శతాధికవృద్ధురాలు చేతికర్ర తాటిస్తూ ఉన్నట్టుండి బారులు తీరిన పురజనుల మధ్యనుండి రాజమార్గంలోకి వచ్చేస్తూ అరిచింది. ఆమె పిలుపు రధంలోని శ్రీకృష్ణులవారి చెవిన బడింది.

సాత్యకి కళ్ళాలుబిగించి అశ్వాలను నిలిపాడు. కావలిభటులు ఆమెను పక్కకు లాగబోయారు. కాని శ్రీకృష్ణులవారి చేతిసైగను గమనించి ఆమెను రధం వైపు తీసుకొచ్చారు. రధాన్ని ఆపాడు సాత్యకి.

ఒక సాధారణ వృద్ధమహిళ అందునా చూపుసరిగా కనబడని ఆమెకోసం సాక్షాత్తూ ఆ వేణుమాధవుడు రథం దిగి వచ్చి ఆప్యాయంగా ఆమె చేయి అందు కోవటం సాధారణ విషయం కాదు.

"ఎవరు... ఎవరు నాయనా మీరు? మా కన్నయ్య వేనా!" సందేహ నివృత్తికోసం శ్రీకృష్ణుని చేతిని తడుముతూ అడిగిందామె.

"పిలిచినావు గదమ్మా. రాకయుందునా... నీ కన్నయ్యనే తల్లీ. సౌఖ్యములే గద?" ఎంతో ఆదరంతో పరామర్శించాడు మాధవుడు.

ఆమె కనులవెంట బొటబొటా కన్నీరు ప్రవహించింది. ఆనందంతో పరవశించింది.

"నీ అండ ఉండగా మాకు సౌఖ్యములకు కొదవాగిరిధరా... కొడుకులు, చక్కని కోడండ్రు, మనవలు మనవరాండ్రతో ఏ లోటూ లేకుండా ఉన్నాను తండ్రీ" అందా వృద్ధ స్త్రీ.

"మరి ఏల పిలిచితివమ్మా. ఏమి నీ కోరిక? వ్రేపల్లెలో మేము బాలునిగా ఉండగా మము చంకన వేసుకుని తిప్పిన మాతవు. నిను మరతునా... కోరుకొమ్ము... ఏమి కావలె?" అన్నాడు మాధవుడు.

"నా తండ్రి... మా నాయన... ఇన్ని బాధ్యతల యందు ఇంత గొప్ప నాయకునిగా ఎదిగినా, వ్రేపల్లెను, మమ్మును మరువని నీ గొప్పమనసును ఏమని పొగడుదును కృష్ణా. సాక్షాత్తూ ఆ శ్రీహరివి నీవుగాకున్న ఇంత జ్ఞాపకశక్తి ఎటులబ్బును.

తండ్రీ! చూపు మందగించిన మందభాగ్యురాలను, కనులార నీ దివ్యసుందర మంగళరూపమును జూడనెంచితి. చూపు ప్రసాదించు నాయనా" అంటూ తన కోరిక తెలిపిందా వృద్ధ స్త్రీ.

"అటులనే తల్లీ. నీకు దివ్యమగు చూపు ప్రసాదించితి" అంటూ శ్రీకృష్ణ ప్రభువు తన మురళిని ఒక్కసారి ఆమె కనులకు తాకించాడు.

అంతే– రెండుమార్లు రెప్పలల్లార్చిన వెంటనే ఆమె కనులముందు వెలుగు రేఖలు పొడచూపాయి.

క్రమంగా శ్రీకృష్ణులవారి ముఖారవిందం స్పష్టంగా గోచరించింది. ఆ శిఖిపింఛమౌళిని గాంచిన ఆనందాతిశయంలో ఆ వృద్ధురాలు పరవశించి పోయింది.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Yatra+2**

* * *